క్లుప్తంగా

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును నిలిపివేయాలి



అచ్చంపేట: ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రమైన అచ్చంపేటలో ముస్లింలు ఆదివారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. ఈ బిల్లు మత స్వేచ్ఛకు భంగం కలుగచేస్తుందన్నారు. బీజేపీ పాలనలో మైనార్టీలపై అణచివేత ధోరణి కనిపిస్తోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఉద్యమం మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసమని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అచ్చంపేట సర్పంచ్ షేక్ జాని, షేక్ కమల్ సైదా, షేక్ బీరువాల జాని పాల్గొన్నారు.

హేమేలమ్మ మృతి తీరని లోటు



సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ కార్యకర్త గుజ్జర్లపూడి హేమేలమ్మ మృతి పార్టీకి తీరని లోటు అని సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. కౌన్సిలర్ గుజ్జర్లపూడి ప్రమీల అత్త హేమేలమ్మ ఇటీవల మృతి చెందారు. ఆదివారం హేమేలమ్మ దశ దిన కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి డాక్టర్ గజ్జల పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెండెం బాబురావు, జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు చిలక జైపాల్, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, కౌన్సిలర్లు పెద్దింటి గోవిందమ్మ వెంకటేశ్వర్లు, సాగరిక మోజేష్, టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుజ్జర్లపూడి కృపావరం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు పంపిణీ



సత్తెనపల్లి: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న 20 మంది నిరుపేదల కుటుంబాలకు గుండవరపు వెంకట్రావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో నిత్యావసర సరకులు ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలోని ఫణిదం చేనేత సొసైటీ వద్ద గంజి వీరాస్వామి పర్యవేక్షణలో రూ. 500 విలువైన వస్తువులు అందించారు. కార్యక్రమంలో న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

నూతన కమిటీలు నియామకం



కందులూరి నాగేశ్వరరావు



వేముల వరప్రసాదరావు

సత్తెనపల్లి: వడియరాజుల సంక్షేమ సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా కందులూరి నాగేశ్వరరావు నియమితులయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా బత్తుల సాంబశివరావు, సెక్రటరీగా దేవాండ్ల నాగయ్య, జాయింట్ సెక్రటరీగా బత్తుల గోపి, ట్రెజరర్‌గా తిరుపతి సురేష్, మెంబర్‌గా చల్లా గోపి ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే సంఘం పట్టణ అధ్యక్షుడిగా వేముల ప్రసాదరావు, వైస్ ప్రెసిడెంట్‌గా పల్లపు బొబ్బిలి, సెక్రటరీగా ఒంటిపులి వెంకటేశ్వర రావు, జాయింట్ సెక్రటరీగా ఒంటిపులి చిన్న వీర్రాజు, ట్రెజరర్‌గా మన్నెం వెంకటేశ్వర్లు, మెంబర్లుగా జేడీపీటీ శ్రీనివాసరావు, తమ్మిశెట్టి శ్రీనివాసరావులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి దేవస్థానం నిర్మాణానికి దాతలు రూ.3.5లక్షల విరాళం అందజేశారు. నరసరావుపేటకు చెందిన మార్శెళ్ల శ్రీనివాస్, సౌజన్య దంపతులు రూ..2.5లక్షలు, పెరుమాళ్ల సత్యనారాయణ, ఆదిలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళం అందించారు. ఆలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా విరాళాలను దాతలు ఈవో ఎస్.మాధవీలతకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొత్తలంక కార్తికేయశర్మ, నందూరి కాశీకృష్ణ పాల్గొన్నారు.

మండు వేసవిలో దాహార్తి కేకలు

ఎండలు మండుతుండటంతో మార్చి నెలలోనే క్రోసూరులో నీటి ఎద్దడి తీవ్రంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో బావులు, బోర్లల్లో నీళ్లు లేని పరిస్థితి నెలకొంది. ఇక్కడి అతి పెద్ద చెరువులోని నీరు జనవరి నెలలోనే చేపల కోసం వదిలారు. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం నీళ్లు పెడతామని చెప్పిన మైనర్ ఇరిగేషన్ ఏఈ బాలకృష్ణ ఇప్పుడు నోరు మెదపడం లేదు. ప్రస్తుతం ఎండిపోయిన చెరువు దర్శనం ఇస్తోంది. ఇక్కడ నీరు ఉండి ఉంటే భూగర్భజలాలతో బావుల్లో, బోర్లలో నీరు పుష్కలంగా లభించేవి.

- బోర్లు, బావులు ఎండిపోయి ప్రజలకు అవస్థలు
- చెరువులో చుక్కనీరు లేని దుస్థితి
- సమస్య పరిష్కారంలో పాలకుల నిర్లక్ష్యం



ఎండిపోయిన క్రోసూరులోని కొత్తూరు, పాతూరు బావులు



చేతి పంపులో నీరు రాని దృశ్యం



ఎండిపోయిన క్రోసూరు చెరువు

క్రోసూరు : క్రోసూరులోని కొత్తూరు, పాతూరు వీధుల్లో బావుల్లో చుక్క నీరు లేదు. బోర్ల నుంచి నీరు రావటం లేదు. దీనిపై ఈ నెల 4వ తేదీన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ–2 హుస్సేన్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నీరు లేక అవస్థలు పడుతున్నామని పలువురు మహిళలు ఇటీవల క్రోసూరు జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి హాజరైన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను కలుసుకునేందుకు ప్రయత్నించారు. కానీ స్థానిక నేతలు తమకు కలిసే అవకాశం ఇవ్వలేదని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మైనర్ ఇరిగేషన్ అధికారులు, పంచాయతీ అధికారులు స్పందించి నీరు అందించేలా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చాలా దూరం వెళ్లి తెచ్చుకుంటున్నాం



మా వీధిలో బావులు, బోర్లు ఎండిపోయాయి. నీటి కోసం చాలా దూరం వెళ్లి రావాల్సి వస్తోంది. తీవ్ర అవస్థలు పడుతున్నాం. చెరువులో నీరు ఉంటే బావులు, బోర్లలో కూడా ఉండేవి. కానీ చెరువు పూర్తిగా ఎండిపోయింది. అధికారులు ట్యాంకర్ల ద్వారానైనా నీరు అందించే ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– షేక్ రహమతుల్లా, కొత్తూరు, క్రోసూరు.

నీటి సమస్య అధికారుల దృష్టికి తెచ్చా



క్రోసూరులో నీటి సమస్య తీవ్రంగా ఉంది. బావులన్నీ ఎండిపోయాయి. బోర్లల్లో నీళ్లు రాక మహిళలు అవస్థలు పడుతున్నారు. ఉదయాన్నే కూలి పనులకు పోయేవాళ్లు నీరు లేక చాలా ఇక్కట్లు పడుతున్నారు. ఈ విషయంపై సమావేశంలో అధికారులను అడిగాను. ఇకనైనా చర్యలు తీసుకోవాలి.

– షేక్ హుస్సేన్‌బీ, ఎంపీటీసీ–2, క్రోసూరు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం



సత్తెనపల్లిలో కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు



అచ్చంపేటలో..



క్రోసూరులో..



ఇరుకుపాలెంలో...

అచ్చంపేట: అచ్చంపేటలో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ సోదరులు ఈత మట్టలను చేతబట్టి వాగొడ్డు చర్చి నుంచి గ్రామంలోని ఎస్సీ కాలనీ చర్చి వరకు ర్యాలీగా వచ్చారు.

క్రోసూరులో..

క్రోసూరు: క్రోసూరులోని లూథరన్ చర్చిలో పాస్టర్ రెవ డాక్టర్ ఎం. సుందరరావు ఆధ్వర్యంలో మట్టల ఆదివారం నిర్వహించారు. సండే స్కూల్ విద్యార్థులు, యవత ఈత మట్టలు చేతపట్టుకొని గ్రామ ప్రధాన వీధులలో ప్రదర్శన చేశారు. ఏసుక్రీస్తు ప్రేమ, జాలి, దయ, గుణములతో ప్రజల పాపముల కోసం శిలువ మరణం పొందారని తెలిపారు. ఏసు చూపిన మార్గంలో ప్రజలు జీవించాలని కోరారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి: మట్టల ఆదివారం సందర్భంగా పట్టణంలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రదర్శన జరిగింది. పట్టణంలోని పుర విధుల్లో ఏసుక్రీస్తుకు జయము అంటూ నినాదాలతో ప్రదర్శన సాగింది. సంఘ కాపరి రెవ. జె.ఇశ్రాయేలు, సండే స్కూల్ చిన్నారులు, స్త్రీలు, సంఘస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో..

ముప్పాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవ సోదరులు మట్టల ఆదివారం నిర్వహించారు. క్రీస్తు రాకను పురస్కరించుకొని స్వాగతం పలుకుతూ చిన్నారులు, మహిళలు ఈత మట్టలను పూలతో అందంగా అలంకరించి గీతాలు ఆలపిస్తూ ఊరేగింపుగా సాగారు. చర్చిల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. ఇరుకుపాలెంలోని పరిశుద్ధ పౌలు లూథరన్ చర్చి పాస్టర్ ఎం.నాగేశ్వరరావు క్రీస్తు సందేశాన్ని అందించారు.

పెదకూరపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం క్రైస్తవ సోదరులు మట్టల ఆదివారం వేడుకలు భక్తి శ్రద్ధలతో చేశారు. ఈ సందర్భంగా పెదకూరపాడులోని ఆర్సీఎం సంఘస్తులు స్థానిక ఆర్సీఎం పాఠశాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముగ్గురు రాజుల దేవాలయం విచారణ గురువులు పుట్టి సుందరాజు భక్తులతో కలిసి ముగ్గురు రాజుల దేవాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ గురువులు రెవరెండ్ పెంటారెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక దివ్యపూజ బలి నిర్వహించారు. లూథరన్ చర్చి, తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో మట్టలతో ప్రదర్శన నిర్వహించారు. లూథరన్ దేవాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.



పెదకూరపాడులో..



ముగ్గురు రాజుల దేవాలయం వద్ద..

పెట్రో ధరలు తగ్గించాలని డిమాండ్

క్రోసూరు: కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని శివసేన పార్టీ స్టేట్ ప్రెసిడెంట్ వినోదుల నరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెరుగుదల సామాన్య ప్రజల జీవనాన్ని దుర్భరం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ఆర్థికాభివృద్ధికి తెలుగు రాష్ట్రాలు గణనీయంగా సహకరిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు

నకరికల్లు: ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు పేర్కొన్నారు. మండలంలోని గుండ్లపల్లి, నర్శింగపాడు, త్రిపురాపురం, నకరికల్లు గ్రామాలలో ఆయా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ఆదివారం ధాన్యం కొనుగోలు చేశారు. రబీ సీజన్‌కు సంబంధించి ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటాకు రూ.2,320, 75 కేజీల బస్తా రూ.1,745కు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. సాధారణ రకం క్వింటా రూ.2,300కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

మాదలలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదల గ్రామంలో ముస్లిం కాలనీకి చెందిన రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామంలోని ముస్లిం కాలనీకి చెందిన యలవర్తిపాటి బాజి, దక్షిణాది మాబుసుభానిల మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వివాదం జరిగింది. మాబుసుభాని వర్గీయులు బాజీపై దాడి చేశారు. అనంతరం బాజీ తన వర్గీయులతో మాబుసుభాని ఇంటిపైకి వెళ్లి దాడికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని తరిమికొట్టారు. ముందస్తు చర్యలలో భాగంగా గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన సత్తనపల్లి మండలం నందిగామ–గుడిపూడి మధ్య గల కల్వర్టు వద్ద ఆదివారం జరిగింది. వివరాలు.. పెదకూరపాడుకు చెందిన నర్రా హేమంత్ (26) ద్విచక్ర వాహనంపై నందిగామ వస్తున్నాడు. అదే సమయంలో మేడికొండూరుకు చెందిన యువకులు ద్విచక్ర వాహనంపై నందిగామ నుంచి గుడిపూడి వైపు వెళుతున్నారు. రెండు గ్రామాల మధ్య కల్వర్టు వద్ద రెండు బైకులు ఢీకొన్నాయి. నర్రా హేమంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. మరో ద్విచక్రవాహనంపై వారికి స్వల్ప గాయాలయ్యాయి. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గరుడ వాహన సేవ



గరుడ వాహనంపై శ్రీవారు



భక్తులకు గరుడ ముద్ద అందిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: చైత్ర శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో గల అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కలియుగ దైవం శ్రీశ్రీశ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారికి ఆదివారం విశేషంగా శ్రీవారికి స్నపన తిరుమంజనం శోభాయమానంగా జరిగింది. శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ మండపంలో వేంచేసి ఉన్న మూర్తికి శ్రీ చిత్రకవి శ్యాము ఆచార్య రామానుజ స్వామి విశేష పూజ నిర్వహించారు. సర్వాలంకార భూషితుడైన శ్రీవారు తనకు అత్యంత ఇష్టమైన గరుడ వాహనంపై రైల్వేస్టేషన్ పుర వీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో గరుడ ముద్ద, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ ధర్మకర్తలు, శ్రీవారి సేవా సమాజం ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హనుమద్వాహనంపై చెన్నకేశవుడు



మాచర్ల రూరల్: శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని హనుమద్వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి రాజగోపాలాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఊరేగింపును ప్రారంభించారు. శ్రీ ఆంజనేయస్వామి వారు భక్తులందరిలోకి భక్తాగ్రేసుడని, అభయ ప్రదాత అయిన హనుమంతుడు భుజస్కందముల పై శ్రీలక్ష్మీ నరసింహస్వామి అధిరోహించిన ఉత్సవాన్ని తిలకించి సేవించిన వారందరికీ సద్బుద్ధిని, అభయాన్ని ప్రసాదిస్తారని ఆయన చెప్పారు. ఈఓ ఎం పూర్ణచంద్రరావు నేతృత్వంలో జెఏ వీరారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కొమెర అనంతరాములు, బండ్ల బ్రహ్మం, గాజుల గణేష్, కోమటి వీరు, మద్దిగపు శ్రీనివాసరెడ్డి, సుంకె వాసు తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్ కృషి ఎనలేనిది



బీపీ మండల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

సత్తెనపల్లి: దేశ రాజకీయలలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఉండాలని వారి అభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి బీపీ మండల్ అని బీసీ సంఘాల నాయకులు అన్నారు. బీసీల రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ వర్ధంతి కార్యక్రమం బీసీ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్జీవో సెంటర్‌లో ఆదివారం జరిగింది. బీసీ సంఘం నాయకుడు విప్పర్ల కొండలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ చరిత్రలో బీసీల జీవితాలలో వెలుగులు నింపడానికి కేంద్ర ప్రభుత్వానికి 40 సిఫార్సులు చేసిన బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీపీ మండల్ అని కొనియాడారు. నాయకులు ప్రత్తిపాటి హరేకృష్ణ, పులహరి బానోజీ, కుమ్మరి దస్తగిరి, చింక అంకమ్మరావు, బెల్లంకొండ వెంకట చెన్నయ్య, ఎర్రగొర్ల శ్రీనివాస్, షేక్ చిన్నషరీఫ్, చింతపల్లి లాజరు, పిల్లుట్ల ఆంజనేయులు, గుత్తికొండ కొండమ్మ, పిక్కిలి శివ, నర్ర కృష్ణ, గుంటూరు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వడియరాజులు ఐకమత్యంగా పని చేయాలి

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం



ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, దేవళ్ల రేవతి

సత్తెనపల్లి: వడియరాజులు ఐకమత్యంగా పనిచేస్తూ సంఘ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్ గల మాడా విశ్వేశ్వరరావు కల్యాణ మండపంలో సత్తెనపల్లి పట్టణ, నియోజకవర్గ వడియరాజుల సంక్షేమ సేవా సంఘం నూతన కమిటీల ప్రమాణ స్వీకారం మహోత్సవంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సమాజంలో జరుగుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్‌పర్సన్ దేవళ్ళ రేవతి మాట్లాడుతూ సంఘ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కందులూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వడ్డెర సంఘం అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ పదవిని మరింత సమర్థంగా పనిచేసేందుకు ఉపయోగించుకుంటానన్నారు. నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారాలకు హాజరైన ప్రతి ఒక్కరికి కందులూరి నాగేశ్వరరావు, సంఘం పట్టణ అధ్యక్షుడు వేముల వర ప్రసాదరావులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వడ్డెర సంఘ రాష్ట్ర నాయకులు దేవళ్ళ వెంకట్, వడ్డెర సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులో యువకుడి హత్య



హత్యకు ఉపయోగించిన బండరాయి



రక్తపు మడుగులో కోటేశ్వరరావు మృతదేహం



కోటేశ్వరరావు (ఫైల్)

అమరావతి: మండల పరిధిలోని దిడుగు గ్రామంలో శనివారం బెల్టుషాపులో యువకుడిని దారుణంగా హత్య చేసిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల సమచారం మేరకు... దిడుగు గ్రామం బీసీ కాలనీలో ఒకే సామాజికవర్గానికి చెందిన కనసాని కోటేశ్వరరావు(26), గోళ్ళ జాలయ్యలు నివాసం ఉంటున్నారు. శనివారం ఇద్దరు గ్రామంలోని బస్టాండు సెంటర్‌లోని బెల్టుషాపులో ఉదయం నుంచే మద్యం తాగారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కోటేశ్వరరావు వద్ద జాలయ్య చేబదులుగా తీసుకున్న నగదు గురించి గొడవ ఏర్పడింది. ఇద్దరు ఘర్షణ పడ్డారు. కోటేశ్వరరావు ఇటుక రాయితో జాలయ్యపై దాడి చేయటంతో చేతికి గాయమైంది. జాలయ్య సమీపంలోని బండరాయి తీసుకుని కోటేశ్వరరావు తలపై బలంగా నాలుగైదుసార్లు మోదటంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. స్థానికులు అమరావతి పోలీసులకు సమాచారమివ్వగా సీఐ అచ్చియ్య తన సిబ్బందితో వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బెల్టు షాపు వద్ద సీసీ కెమెరాలను, ఫుటేజీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోటేశ్వరరావు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. కోటేశ్వరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జాలయ్య పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నేడు అంబేడ్కర్ జయంతి వేడుకలు

విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నేతలు పిలుపు

సత్తనపల్లి: పట్టణం, సత్తెనపల్లి రూరల్ మండలంలో సోమవారం జరిగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం కోరారు. సోమవారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెండెం బాబురావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరుగుతాయన్నారు. అనంతరం పేద మహిళలకు చీరల పంపిణీ జరుగుతుందని తెలిపారు. అలాగే ఉదయం 10 గంటలకు 8వ వార్డు క్రిస్టియన్‌పేటలో, 11 గంటలకు సత్తెనపల్లి మండలం పెదమక్కెన గ్రామంలో మట్టుపల్లి చిన్నబాబు ఆధ్వర్యంలో, 11:30 గంటలకు గర్నెపూడి గ్రామంలో మాజీ ఎంపీటీసీ కాశిమాల ఓబయ్య ఆధ్వర్యంలో, 12 గంటలకు కంకణాలపల్లి గ్రామంలో కాంద్రు నాగభూషణం ఆధ్వర్యంలో, సాయంత్రం 7:30 గంటలకు రెంటపాళ్ల గ్రామంలో ఏకుల ముత్తయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

ప్రజల్ని బానిసలుగా చేసేందుకు యత్నం

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్



మాట్లాడుతున్న చిట్టా విజయభాస్కరరెడ్డి

సత్తెనపల్లి: ప్రజల్ని బానిసలుగా చేసేందుకే పీ – ఫోర్ విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చిట్టా విజయభాస్కరరెడ్డి అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదున్నర కోట్ల జనాభాలో 45 లక్షల నుంచి 50 లక్షల కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నాయన్నారు. ప్రైవేట్ భాగస్వామ్యం అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ అని చెప్పారు. 40 లక్షల కుటుంబాలు 10 శాతం ఉన్న పెట్టుబడిదారీ విధానానికి బానిసలుగా మార్చాలని ఉద్దేశంతో పీ – ఫోర్ విధానం తీసుకొచ్చారని ఆరోపించారు. ప్రపంచ బ్యాంకు రూల్స్ మేరకు పీ – త్రీ విధానాన్ని చంద్రబాబు గతంలో తీసుకొచ్చారని, దాని ద్వారా ప్రజలకు ఏం మేలు చేశారో చెప్పాలన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో సామాన్యుడి ఆకలి తీర్చే విధానాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. ప్రతి నిరుపేద కుటుంబానికి రూ. 1.50 లక్షల వరకు సహాయం చేశారన్నారు. హెరిటేజ్ సంస్థకు వచ్చే రూ. వేల కోట్ల లాభాలను తీసుకొచ్చి పేదలకు పంచగలుగుతారా? అని సీఎంను ఆయన ప్రశ్నించారు.